

విజన్ పక్షం

PRGI.TGBIL/26/A0206



ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు..
సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

సంపుటి:-01, సంచిక:-136, ఆదివారం 11-10-2026, పేజీలు:-4, వెల: 2/-, ఎడిటర్:- ఎల్లని రాజేశ్వర్ గౌడ్ , పబ్లిషర్స్ : తెలంగాణ , ఆంధ్రప్రదేశ్

భూ వివాద రహిత తెలంగాణే ప్రజాప్రభుత్వ లక్ష్యం

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



సుమారు 125 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారానికి సమగ్ర భూ సర్వేకు శ్రీకారం చుట్టడం జరిగింది. భూ వివాదాలు లేని తెలంగాణను నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సమగ్ర

ఎల్‌నినో ప్రభావంపై సీఎం సమీక్ష

- 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు
- ఎల్‌నినో ప్రభావంపై సీఎం ప్రత్యేక సమీక్ష
- రైతుల సమస్యలపై మంత్రులతో చర్చ
- రూ.20 వేల కోట్ల ప్యాకేజీ కోసం కేంద్రానికి విజ్ఞప్తి
- సాగునీరు, తాగునీరు, విద్యుత్‌పై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 12న మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. వర్షపాతం తగ్గిన ప్రాంతాల్లో పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ప్రభుత్వం చేపట్టాల్సిన తక్షణ చర్యలపై



ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది



- అధికారంలో ఉన్నవారికి ఈసీ రక్షణ కవచం కాదన్న హరీశ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్
- అన్నిటికన్నా ప్రజాస్వామ్యం గొప్పదని వ్యాఖ్య

భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికల సంఘం- మిగతా 2 లో

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

- ప్రజా తీర్పును గౌరవించడం కాంగ్రెస్‌కు అలవాటు లేదన్న కిషన్ రెడ్డి
- రాహుల్ గాంధీ తీరులో ప్రమాదకర ధోరణులు కనిపిస్తున్నాయని విమర్శ
- ఫలితాలు వ్యతిరేకిస్తే రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ విష ప్రచారం చేస్తుందని మండిపాటు- మిగతా 2 లో



రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు

"ఓట్ల దొంగతనం"పై రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన విపక్షాలు

- ఆరోపణలకు ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి కోరినట్లు వెల్లడించిన రాహుల్
- ప్రధాని, హోంమంత్రి, సీఈసీ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తున్నారని ఆరోపణ
- సీఈసీ రాజీనామా చేయాలని, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరపాలని డిమాండ్
- సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించిన విపక్ష కూటమి



దేశంలో "ఓట్ల దొంగతనం" (జఠీవ ఎష్ట్రశీతీఅ) జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్

నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంతో.. ట్రంప్ అసహనం

- నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ట్రంప్ అసంతృప్తి
- విజేత నవీ పిళ్లైను విమర్శిస్తూ చేసిన పోస్టును రీషేర్
- దక్షిణాఫ్రికా న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైకు 2026 శాంతి బహుమతి
- అంతర్జాతీయ నేరాలపై ఆమె పోరాటానికి గుర్తింపుగా పురస్కారం



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతిని ఆశించి మరోసారి భంగపడ్డారు. తాను ఆశించిన 2026 - మిగతా 2 లో

పాక్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్ అసలు దాని అర్థం ఏంటి?

- ఐరాస వేదికగా షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్
- పాకిస్థాన్ ఎన్నికల్లో 'ఫామ్ 45' అనేది ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను చూపించే పత్రం
- 'ఫామ్ 47' నియోజకవర్గం స్థాయిలో ఫలితాలను చూపించే డాక్యుమెంట్
- 2024 ఎన్నికల్లో ఫామ్ 45, ఫామ్ 47 వివరాలు సరిపోలలేదన్న పీటీఐ
- ఫామ్ 47లో అక్రమాలు చేశారని ఆరోపించే కోణంలోనే కొత్త పదబంధంతో విమర్శలు- మిగతా 2 లో



తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలు

విజయ్ పార్టీ గెలుపుపై స్టాలిన్ స్పందన



- తమిళనాడు ఉపఎన్నికల్లో అధికార టీవీకే విజయం
- ఇది ద్రోహ రాజకీయాల తాత్కాలిక గెలుపన్న స్టాలిన్
- మైనారిటీ ప్రభుత్వాన్ని మెజారిటీగా మార్చే కుట్ర అని విపక్షాల ఆరోపణ
- డబ్బు, అధికార దుర్వినియోగంతోనే గెలిచారంటూ విమర్శలు- మిగతా 2 లో

భద్రతా వలయంలో ఢిల్లీ!



- అన్ని అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్న అమిత్ షా
- సీఈసీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాల భారీ నిరసనలకు పిలుపు
- ఢిల్లీలో 20 వేల మంది బలగాలతో కఠిన భద్రతా ఏర్పాట్లు
- 57 మెట్రో స్టేషన్ల మూసివేయాలన్న పోలీసులు.. పలు రైళ్ల సర్వీసులు రద్దు
- జంతర్ మంతర్ వద్ద నిరసనకు పోలీసుల అనుమతి నిరాకరణ
- పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్షలు

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు

యోగి సర్కారు కీలక నిర్ణయం!

- పేరుమార్పు తీర్మానానికి యోగి మంత్రివర్గం ఆమోదం
- మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితం పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్ణయం
- మోదీకి రాష్ట్రంతో ప్రత్యేక అనుబంధం ఉందన్న యోగి
- విమానాశ్రయం తొలి దశను మార్చిలో ప్రారంభించిన ప్రధాని మోదీ
- తొలి దశలో ఏడాదికి 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు

ఉత్తర్‌ప్రదేశ్‌లోని నోయిడాలో ఉన్న జెవార్ అంతర్జాతీయ విమానాశ్రయం పేరును మార్చాలని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై ఈ విమానాశ్రయాన్ని 'నరేంద్ర మోదీ అంతర్జాతీయ విమానాశ్రయం'గా పిలవనున్నారు. ప్రధాని మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు



బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన



- స్థానిక సంస్థల్లో 34 శాతం బీసీ రిజర్వేషన్లపై ఏపీ ప్రభుత్వ పిటిషన్ కొట్టివేత
- 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటరాదన్న హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీంకోర్టు
- కోర్టు తీర్పుతో సంబంధం లేకుండా బీసీలకు అండగా ఉంటామన్న చంద్రబాబు

ప్రజల విశ్వాసాన్ని ఈసీ కోల్పోతోంది

మొదటిపేజీ తరువాయి – (ఈసీ) వెన్నెముక వంటిదని, అది అధికారంలో ఉన్నవారికి రక్షణ కవచంలా మారకూడదని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం పనితీరు, నియామకాలపై వస్తున్న ప్రశ్నలతో రాజ్యాంగ పునాదులు బలహీనపడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణలో (సర్) భాగంగా పెద్ద ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే ఈసీపై ప్రజలకు నమ్మకం పోతోందన్నారు. "ప్రజాస్వామ్యం అన్నింటికన్నా గొప్పది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడంలో విఫలమైతే, అందుకు బాధ్యత వహిస్తూ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ తప్పుకోవాలి" అని హరీశ్ రావు స్పష్టం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 324, 325, 326 ప్రకారం స్వేచ్ఛాయుతమైన, నిష్పక్షపాతమైన ఎన్నికలు జరగాలని గుర్తుచేశారు.

ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా?

మొదటిపేజీ తరువాయి – కాంగ్రెస్ పార్టీకి, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ప్రజా తీర్పును గౌరవించడం అలవాటు లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ పనితీరులో ఒక వింత, ప్రమాదకరమైన ధోరణి కనిపిస్తోందని ఆయన ఆరోపించారు. వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చినప్పుడే ప్రజాస్వామ్యం ఉన్నట్టా? అని ప్రశ్నించారు. ఫలితాలు వ్యతిరేకంగా వస్తే రాజ్యాంగ సంస్థలపై విష ప్రచారం చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా పనిచేయనప్పుడల్లా ఎన్నికల సంఘం, కాగ్, న్యాయవ్యవస్థ, పార్లమెంట్ వంటి రాజ్యాంగ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీయడం అలవాటుగా మార్చుకుందని ఆయన ఆరోపించారు. ప్రజాతీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు, రాజ్యాంగ సంస్థలు అవినీతిమయమయ్యాయని కాంగ్రెస్ నేతలు ఆరోపణలకు దిగుతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ కీలకమైన సంస్థలపై ప్రజలు ఉంచిన నమ్మకాన్ని దెబ్బతీసే లక్ష్యంతోనే కాంగ్రెస్ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

తమిళనాడు ఉప ఎన్నికల ఫలితాలు

మొదటిపేజీ తరువాయి – తమిళనాడులోని ధరాపురం, మధురాంతకం అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉపఎన్నికల్లో అధికార తమిళగ వెట్రి కళగం (టీవీకే) విజయం సాధించింది. అయితే, ఈ ఫలితాలపై డీఎంకే అధ్యక్షుడు ఎం.కే. స్టాలిన్ తీవ్రంగా స్పందించారు. ఇది "ద్రోహ రాజకీయాల తాత్కాలిక విజయం" అని అభివర్ణించిన ఆయన, "తప్పుడు ప్రతిష్ఠ రాజకీయాల పతనం మొదలైంది" అని వ్యాఖ్యానించారు. సోషల్ మీడియా వేదికగా శుక్రవారం స్టాలిన్ స్పందిస్తూ, అధికార టీవీకేకు వ్యతిరేకంగా పోలైన ఓట్లను గమనిస్తే, మెజారిటీ ప్రజలు ఆ పార్టీని తిరస్కరించినట్లేనని విశ్లేషించారు. ఎమ్మెల్యేల బేరసారాలు, ఇతర పార్టీల నేతలను ప్రలోభపెట్టడం, కక్ష సాధింపు చర్యలు, అనాగరిక చర్చలను మానుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో రీల్స్ చేయడంపై కాకుండా, ప్రజా సమస్యల పరిష్కారంపై ముఖ్యమంత్రి విజయ్ దృష్టి సారించాలని హితవు పలికారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు నెలలకే ఇద్దరు ఎమ్మెల్యేలు రాజీనామా చేసి అధికార పార్టీలో చేరడం వల్లే ఈ ఉపఎన్నికలు వచ్చాయని స్టాలిన్ ఆరోపించారు. దీనిని ఆయన "ప్రజాస్వామ్య హత్య"గా పేర్కొన్నారు. ధన బలం, అధికార దుర్వినియోగం, పోలీసు బలంతోనే టీవీకే గెలిచిందని విమర్శించారు. ముఖ్యమంత్రి విజయ్ కేవలం తన సినీ ఇమేజ్‌తో రాజకీయాలు చేస్తున్నారని, సొంతంగా మెజారిటీ సాధించలేక ఎమ్మెల్యేల బేరసారాలతో ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కించుకున్నారని దుయ్యబట్టారు. విజయ్ ఈ రెండు నియోజకవర్గాల్లో నాలుగు రోజుల పాటు పర్యటించి, టీ దుకాణాలను సందర్శించడం, ట్రాక్టర్ నడపడం వంటివి చేయడంపై ఆయన ఎద్దేవా చేశారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె. పళనిస్వామి కూడా టీవీకే విజయం తాత్కాలికమేనని వ్యాఖ్యానించారు. అధికార దుర్వినియోగం, విచ్చలవిడి డబ్బు పంపిణీతోనే వారు గెలిచారని ఆరోపించారు. తమ పార్టీ ఎమ్మెల్యేలతో బేరసారాలు సాగించి, మైనారిటీ ప్రభుత్వాన్ని మెజారిటీగా మార్చుకునే దురుద్దేశంతోనే టీవీకే ఈ ఉపఎన్నికలను కొనితెచ్చిందని విమర్శించారు.

నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంతో.. ట్రంప్ అసహనం

మొదటిపేజీ తరువాయి – నోబెల్ శాంతి పురస్కారం దక్కకపోవడంపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ ఏడాది విజేతగా నిలిచిన దక్షిణాఫ్రికా మానవ హక్కుల న్యాయ నిపుణురాలు నవీ పిళ్లైతో పాటు, అవార్డును ప్రకటించిన నార్వేజియన్ నోబెల్ కమిటీని విమర్శిస్తూ చేసిన ఒక పోస్టును ఆయన తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో రీషేర్ చేశారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడిన కొద్ది గంటలకే ట్రంప్ ఈ మేరకు స్పందించారు. తన మాజీ న్యాయవాది డేవిడ్ షోయెన్ చేసిన ఒక పోస్టును ఆయన పంచుకున్నారు. "ఐక్యరాజ్యసమితికి చెందిన నవీ పిళ్లైకు ఈ పురస్కారాన్ని అందజేయడం ద్వారా నోబెల్ కమిటీ కోలుకోలేని విధంగా అవమానానికి గురైంది. ఒకప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన నోబెల్ శాంతి బహుమతి విలువను ఇది తగ్గించింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. నవీ పిళ్లై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలను తీవ్రంగా ద్వేషిస్తారని, ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తూ హమాస్‌కు అండగా నిలిచారని అందులో ఆరోపించారు. గాజాలో ఇజ్రాయెల్ మారణహోమానికి పాల్పడిందని ఆమె నేతృత్వంలోని ఐరాస కమిషన్ నివేదించడాన్ని ఒక "ప్రహసనం"గా అభివర్ణించారు. అదే సమయంలో, అబ్రహాం ఒప్పందాలు, బందీల విడుదల, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ నివారణకు ట్రంప్ చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకే నోబెల్ దక్కాలని ఆ పోస్టులో పేర్కొన్నారు. మరోవైపు, 2026 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతిని దక్షిణాఫ్రికాకు చెందిన 85 ఏళ్ల నవీ పిళ్లైకు నార్వేజియన్ నోబెల్ కమిటీ ప్రకటించింది. యుద్ధ నేరాలు, మారణహోమాలు, మానవ హక్కుల ఉల్లంఘనలకు బాధ్యులైన వారిని గుర్తించి, చట్టానికి కట్టబెట్టడంలో ఆమె చేసిన సుదీర్ఘ పోరాటానికి ఈ గుర్తింపు దక్కినట్లు కమిటీ తెలిపింది. గతంలో ఆమె ఐరాస మానవ హక్కుల హైకమిషనర్‌గా, అంతర్జాతీయ న్యాయస్థానం న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ అవార్డు విషయం తెలిసే సమయానికి నవీ పిళ్లై జర్మనీలోని న్యూరెమ్‌బర్గ్ కోర్టులో ఒక కార్యక్రమంలో ఉన్నారు. ఈ వార్త తెలియగానే ఆమె చమత్కరిస్తూ, "మీరు ఇంకాస్త గట్టిగా చప్పట్లు కొడితే, ఈ బహుమతిని నేను ట్రంప్‌తో పంచుకుంటా" అని వ్యాఖ్యానించడంతో అక్కడ నవ్వులు పూశాయి. ట్రంప్ చాలాకాలంగా నోబెల్ శాంతి బహుమతిని ఆశిస్తున్నారు. ఈ ఏడాది పాకిస్థాన్ ప్రధాని ఆయన పేరును నామినేట్ కూడా చేశారు.

భద్రతా వలయంలో ఢిల్లీ!

మొదటిపేజీ తరువాయి – ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్రోచ్ జనతా పార్టీ, ప్రతిపక్ష ఇండియా కూటమి తలపెట్టిన భారీ నిరసనల నేపథ్యంలో దేశ రాజధాని ఢిల్లీ కట్టుదిట్టమైన భద్రతా వలయంలోకి వెళ్లింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. 20,000 మందికి పైగా పోలీసులు, పారామిలిటరీ బలగాలను మోహరించి, దేశ రాజధానిలో భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తన అధికారిక పర్యటనలు, అపాయింట్‌మెంట్లు రద్దు చేసుకున్నారు. గత రెండు రోజులుగా ఆయన ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, భద్రతా చర్యలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ఈరోజు జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన నిరసన ప్రదర్శనకు పోలీసులు అనుమతి నిరాకరించారు. భద్రతా చర్యల్లో భాగంగా, ఢిల్లీలోని 57 మెట్రో స్టేషన్లను రెండు రోజుల పాటు మూసివేయాలని పోలీసులు మెట్రో అధికారులను కోరారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ స్టేషన్లకు వచ్చే పలు రైళ్లను ఈరోజు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. జంతర్ మంతర్ పరిసరాల్లో సీసీటీవీలు, ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాలతో నిఘాను కట్టుదిట్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ నివాసం, ఈసీ కార్యాలయం వద్ద ఇప్పటికే ఉన్న జడ్ ప్లస్ భద్రతతో పాటు భారీగా భద్రతను పెంచారు. ఇదిలా ఉండగా, ఢిల్లీకి వస్తున్న తమ కార్యకర్తలను నాగ్‌పుర్, భోపాల్ వంటి నగరాల్లోనే పోలీసులు అడ్డుకుంటున్నారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. సోషల్ మీడియా పోస్టులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టినట్లు అధికారులు వెల్లడించారు.

నోయిడా విమానాశ్రయానికి మోదీ పేరు యోగి సర్కారు కీలక నిర్ణయం!

మొదటిపేజీ తరువాయి – పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గం తీర్మానాన్ని ఆమోదించిందని తెలిపారు.శుక్రవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మొత్తం 39 ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అనంతరం మీడియాతో మాట్లాడిన యోగి.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో మోదీ 25 ఏళ్ల ప్రజా సేవ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌తో ప్రధానికి ప్రత్యేక అనుబంధం ఉందని, వారణాసి నుంచి ఎంపీగా ఎన్నికైన ఆయన నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగుతోందని చెప్పారు. 2017కు ముందు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉండేవని యోగి పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్స్‌ప్రెస్‌వేలు, జాతీయ రహదారులు, మెట్రో, రీజినల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ వ్యవస్థలతో రవాణా సౌకర్యాలు గణనీయంగా మెరుగయ్యాయని తెలిపారు. అయోధ్య రామమందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ కారిడార్ అభివృద్ధి వంటి కార్యక్రమాలను కూడా ప్రస్తావించారు. జెవార్‌లో నిర్మిస్తున్న నోయిడా విమానాశ్రయం ఉత్తర్‌ప్రదేశ్‌కు అందించిన గొప్ప బహుమతిగా యోగి అభివర్ణించారు. ఇది భవిష్యత్తులో దేశంలోనే కీలక విమానయాన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విమానాశ్రయం తొలి దశను ప్రధాని మోదీ ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. మొదటి దశలో ఏడాదికి సుమారు 1.2 కోట్ల మంది ప్రయాణికులకు సేవలందించే సామర్థ్యం ఉండనుంది. నాలుగు దశల నిర్మాణం పూర్తయితే ఆసియాలోనే అతిపెద్ద విమానాశ్రయాల్లో ఒకటిగా నిలవనుంది.

బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పుపై చంద్రబాబు స్పందన



మొదటిపేజీ తరువాయి – స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీ) 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రయత్నాలకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈరోజు కొట్టివేసింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదంటూ గతంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ఈ సందర్భంగా సమర్థించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లతో కలిపి మొత్తం కోటా 50 శాతం మించకూడదన్న నిబంధనను హైకోర్టు గుర్తుచేయడం సమంజసమేనని సుప్రీంకోర్టు తన తీర్పులో పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు. న్యాయస్థానాల తీర్పులు ఎలా ఉన్నప్పటికీ, తమ కూటమి ప్రభుత్వం బీసీలకు పూర్తిస్థాయిలో రాజకీయంగా అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ అభ్యర్థులకు పార్టీ తరఫున అధిక శాతం సీట్లు కేటాయించి, వారి రాజకీయ ప్రాధాన్యాన్ని కాపాడతామని స్పష్టం చేశారు. బీసీలకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తుందని తెలిపారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు దక్కడాన్ని వైసీపీ సహించలేకపోయిందని చంద్రబాబు ఆరోపించారు. అందుకే కోర్టులకు వెళ్లి, బీసీల రాజకీయ వాటాను అడ్డుకునేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం బీసీల కోటాను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించడం వల్ల బీసీలు సుమారు 16,800 పదవులు కోల్పోయారని ఆయన గుర్తుచేశారు.

భూ వివాద రహిత తెలంగాణే ప్రజాప్రభుత్వ లక్ష్యం



మొదటిపేజీ తరువాయి – భూ రీ--సర్వేను ఏడాదిన్నరలో పూర్తి చేసేలా పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగుతున్నాము. డా. బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సర్వే పర్యవేక్షణకు ఏర్పాటు చేసిన అధికారులతో భూ సర్వే పురోగతిపై సమీక్ష నిర్వహించడం జరిగింది. రీ--సర్వేను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు 7 జోన్లకు ఒక్కో జోన్‌కు రెవెన్యూ , సర్వే విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 14 మంది అధికారులను నియమించాము. సర్వేలో వేగం ,నాణ్యతతో పాటు ప్రతి దశలోపర్యవేక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేయడం జరిగింది. రీ--సర్వేను రాష్ట్రస్థాయి నుంచి నిరంతరం పర్యవేక్షించేందుకు హైదరాబాద్‌లో ప్రత్యేక డాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించాను. సర్వే పురోగతి, రోజువారీ పనితీరు, గ్రామాల వారీగా పూర్తయిన సర్వే, పనిచేస్తున్న సర్వే బృందాలు, ఉపయోగిస్తున్న రోవర్లు, వాటి లొకేషన్ వంటి వివరాలన్నీ డాష్‌బోర్డులో రియల్‌టైమ్‌లో కనిపించేలా టెక్నాలజీని వినియోగించాలని సూచించడం జరిగింది. రాష్ట్రంలో తొలి దశలో 365 నక్షాలేని గ్రామాల్లో అలాగే జిల్లాకు 70 గ్రామాల చొప్పున 2,240 మొత్తం 2768 గ్రామాల్లో రీసర్వే సాగుతుంది. ఇప్పటివరకు 245 గ్రామాల్లో సర్వే పూర్తి చేయడం జరిగింది. రీ--సర్వే ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైయింది. ప్రతి వారం రాష్ట్రస్థాయిలో అధికారులు సమీక్ష నిర్వహించాలని, ప్రతి 15 రోజులకు స్వయంగా సమీక్షించి పురోగతిని పరిశీలిస్తానని, రీ--సర్వే పేరుతో స్థానికంగా ఎవరైనా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేయడం జరిగింది. ఎర్రవల్లిలో 385 ఎకరాలలో 45 ఎకరాలు తక్కువ ఉంది. సర్వే కోసం మరొక సారి నోటీసులు ఇవ్వడం జరిగింది. ఎర్రవల్లిలో అసైన్డ్ భూములు కొన్ని చేతులు మారాయి వాటిని గుర్తించి చర్యలు తీసుకుంటాము. నిబంధనలకు విరుద్దంగా అసైన్డ్ ల్యాండ్ ఉంటే వాటిని పేదలకు పంచుతాం అని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేయడం జరిగింది.

రాష్ట్రపతిని కలిసిన ఇండియా కూటమి నేతలు




మొదటిపేజీ తరువాయి – కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు. సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. "మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం" అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. "ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం" అని ఖర్గే వివరించారు. టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. "మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం" అని అన్నారు. ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

పాక్ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్' అన్న భారత్ అసలు దాని అర్థం ఏంటి?



మొదటిపేజీ తరువాయి – పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వంపై ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ తీవ్ర విమర్శలు చేసింది. ఆ ప్రభుత్వాన్ని 'ఫామ్ 47 సర్కార్'గా అభివర్ణించింది. ఉగ్రవాదాన్ని అరికట్టడంపై దృష్టి పెట్టకుండా తప్పుడు ప్రచారానికి పాకిస్థాన్ ప్రాధాన్యం ఇస్తోందని భారత దౌత్యవేత్త రఘు పూరి ఆరోపించారు. గతంలో పాకిస్థాన్ పెంచి పోషించిన ఉగ్రవాద సంస్థలే ఇప్పుడు ఆ దేశానికి సమస్యగా మారాయని వ్యాఖ్యానించారు. అయితే, ఈ విమర్శ వెనుక ఉన్న 'ఫామ్ 47' వివాదం ఏంటి? 2024లో పాకిస్థాన్‌లో జరిగిన ఎన్నికల నుంచి ఈ పదం ఎక్కువగా వినిపిస్తోంది. ఆ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన 'పాకిస్థాన్ తెహ్రీక్-ఇ-ఇన్సాఫ్' (పీటీఐ) పార్టీ ఆరోపించింది. ఎన్నికల ఫలితాలను మార్చి షరీఫ్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించింది. ఈ ఆరోపణలను పాక్ ప్రభుత్వం ఎలా చూస్తోందనే అంశం వేరైనా, ఎన్నికల ఫలితాల లెక్కల్లో తేడాలున్నాయన్నది అప్పటి వివాదంలో ప్రధాన అంశం. పాకిస్థాన్ ఎన్నికల్లో 'ఫామ్ 45' అనేది ప్రతి పోలింగ్ కేంద్రంలో నమోదైన ఓట్ల వివరాలను చూపించే పత్రం. ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయన్న సమాచారం ఇందులో ఉంటుంది. 'ఫామ్ 47' మాత్రం నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల ఫలితాలను కలిపి రూపొందించే తాత్కాలిక సమగ్ర ఫలితాల పత్రం. అంటే 'ఫామ్ 45' పోలింగ్ కేంద్రం స్థాయిలో, 'ఫామ్ 47' నియోజకవర్గం స్థాయిలో ఫలితాలను చూపిస్తాయి. 2024 ఎన్నికల్లో పలు నియోజకవర్గాల్లో 'ఫామ్ 45'లో ఉన్న ఓట్ల వివరాలు, 'ఫామ్ 47'లో నమోదైన లెక్కలతో సరిపోలలేదని పీటీఐ ఆరోపించింది. తమ మద్దతుతో పోటీ చేసిన స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రాల లెక్కల ప్రకారం గెలిచినా, తుది ఫలితాల్లో ఓడిపోయినట్లు చూపించారని పేర్కొంది. ఆ ఎన్నికల్లో ఇమ్రాన్ ఖాన్ పార్టీ మద్దతున్న స్వతంత్ర అభ్యర్థులు అత్యధికంగా 101 స్థానాలు గెలుచుకున్నారు. అయినప్పటికీ పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) ఇతర పార్టీలతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కామన్వెల్త్ ఎన్నికల పరిశీలకుల నివేదికలోనూ కొన్ని 'ఫామ్ 47' పత్రాల్లో మార్పులు జరిగి ఉండొచ్చని పేర్కొన్నారు. దీంతో షరీఫ్ ప్రభుత్వాన్ని విమర్శించేందుకు పీటీఐ 'ఫామ్ 47 సర్కార్' అనే పదాన్ని వాడుతోంది. ఎన్నికల్లో అక్రమాల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వమని ఆరోపించడమే ఈ పదం వెనుక ఉద్దేశం. ఐరాస వేదికగా భారత్ ఈ పదాన్ని ప్రస్తావించడంతో పాకిస్థాన్ ఎన్నికల విశ్వసనీయతపై ఉన్న వివాదం మరోసారి అంతర్జాతీయంగా చర్చకు వచ్చింది.



ఎల్‌నినో ప్రభావంపై సీఎం సమీక్ష

ఈ సమావేశంలో చర్చించనున్నారు. వ్యవసాయం, సాగునీరు, తాగునీటి సరఫరా, విద్యుత్ డిమాండ్ పెరుగుదల వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో సాధారణం కంటే 17 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు సమాచారం. దాదాపు 235 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు అవసరమైన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది. కరువు మండలాల ప్రకటనతోపాటు ఆర్థిక సాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రాన్ని కోరింది. రాష్ట్రానికి రూ.20 వేల కోట్ల ప్రత్యేక ప్యాకేజీ కేటాయించాలని విజ్ఞప్తి చేసింది. వర్షాభావ ప్రాంతాల్లో చేపట్టాల్సిన సహాయక చర్యలు, మంత్రివర్గ ఉపసంఘం రూపొందించిన కార్యాచరణ, అఖిలపక్ష సమావేశం నిర్వహణపై కూడా చర్చించే అవకాశముంది. రైతు సంఘాలు, వివిధ రంగాల నిపుణులు చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని రైతులకు ఉపశమనం కలిగించే చర్యలపై ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకోనున్నారు.

మహిళా శక్తికి జాతీయ వేదికగా 'సరస్ మేళా'!

స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు... కృష్ణాతీరంలో అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

విజయవాడ అక్టోబర్ 10 (విజన్ పక్షం): మహిళల చేతుల్లోని నైపుణ్యానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావడం, వారి కష్టానికి తగిన మార్కెట్ అవకాశాలు కల్పించడం, స్వయం సహాయక సంఘాల మహిళలనువిజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా విజయవాడలోని కృష్ణానది తీరాన పున్నమి ఘాట్‌లో 'సరస్ మేళా' నిర్వహణకు సన్నాహాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జరగనున్న ఈ మేళా మహిళా సాధికారతకు, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి ఒక చక్కని వేదికగా నిలవనుంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మేళా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సరస్ మేళాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు.

మహిళల శ్రమకు గుర్తింపు.. ప్రతిభకు ప్రోత్సాహం!

దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన స్వయం సహాయక సంఘాల మహిళలు ఈ మేళాలో పాల్గొని తమ చేతులతో తయారు చేసిన హస్తకళా వస్తువులు, సంప్రదాయ ఉత్పత్తులు, గృహోపకరణాలు, ఇతర వినూత్న ఉత్పత్తులను(ప్రదర్శించనున్నారు. సాధారణంగా ఇళ్లకే పరిమితమయ్యే మహిళల ప్రతిభను సమాజానికి పరిచయం చేయడంతో పాటు, వారి ఉత్పత్తులను నేరుగా



వినియోగదారులకు చేరువ చేసేందుకు సరస్ మేళా ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పించనుంది. మహిళలు తయారు చేసే వస్తువులకు తగిన గుర్తింపు, విస్తృత ప్రచారం, మెరుగైన మార్కెట్ అవకాశాలు లభిస్తే వారి ఆదాయం పెరగడమే కాకుండా కుటుంబ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగుపడతాయి. ఈ దిశగా సరస్ మేళా మహిళలకు వ్యాపార పరిజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు, కొత్త వినియోగదారులను సంపాదించుకునేందుకు, తమ ఉత్పత్తులకు కొత్త మార్కెట్లనుఅన్వేషించేందుకు దోహదపడనుంది. స్వయం సహాయక సంఘాల నుంచి విజయవంతమైన పారిశ్రామికవేత్తల వరకు! మహిళలు కేవలం స్వయం సహాయక సంఘాల సభ్యులు గా మాత్రమే కాకుండా, స్వతంత్రంగా వ్యాపారాలను నిర్వహించేపారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నదే ఈ మేళా ప్రధాన ఉద్దేశం. మహిళల నైపుణ్యానికి,సృజనాత్మకతకు తగిన గుర్తింపు లభించడం తో పాటు, వారి ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో మార్కెట్ అవకాశాలు ఏర్పడితే ఆర్థిక స్వావలంబన సాధించడం మరింత సులభమవుతుంది. గత ఏడాది గుంటూరులో నిర్వహించిన సరస్ మేళా విజయవంతం కావడంతో, అదే స్ఫూర్తితోవిజయవాడలో మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీ కేశినేనిచిన్ని తెలిపారు. డ్వాక్రా, మెప్మా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజల భాగస్వామ్యమే మహిళా విజయానికి బలం!

మహిళలు తయారు చేసిన వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారి శ్రమకు తగిన విలువ ఇవ్వడంతో పాటు, వారి కుటుంబాల ఆర్థిక పురోగతికి ప్రజలు తోడ్పడవచ్చు. స్థానికంగా, గ్రామీణ ప్రాంతాల్లో తయారయ్యే నాణ్యమైన ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించడం ద్వారా స్వదేశీ ఉత్పత్తుల వినియోగం పెరగడంతో పాటు చిన్న వ్యాపారాలకు కూడా ఊతం లభిస్తుంది. అందువల్ల విజయవాడ నగర ప్రజలు, పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళా సంఘాలు, యువత, వ్యాపారవేత్తలు ఈ సరస్ మేళాను సందర్శించి మహిళల ఉత్పత్తులను పరిశీలించి, కొనుగోలు చేసి, వారి ఆర్థిక సాధికారతకు తమ వంతు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. మహిళల చేతివృత్తు లకు ఆదరణ పెరిగినప్పుడే వారి శ్రమకు గుర్తింపు, వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా, సమాజానికి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయి. ఈ కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యాన్ చంద్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి రూ.25 వేల దోపిడీ!

స్క్రాప్ దుకాణంలో నిద్రిస్తున్న అన్నదమ్ములపై దుండగుల దాడి

ఒకరు అరెస్ట్.. మరో ఇద్దరి కోసం పోలీసుల గాలింపు





మొయినాబాద్, అక్టోబర్ 10 (విజన్ పక్షం): స్క్రాప్ విక్రయిస్తామంటూ వచ్చి, కత్తితో బెదిరించి నగదు, సెల్‌ఫోన్లు దోచుకెళ్లిన ఘటనలో శంకర్‌పల్లి పోలీసులు ఒక నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉండటంతో వారి కోసం గాలింపు చేపట్టినట్లు చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు.

తెల్లవారుజామున దోపిడీ.. అన్నదమ్ములకు బెదిరింపులు

ఈ నెల 8వ తేదీ తెల్లవారుజామున ఫతేపూర్ బ్రిడ్జి సమీపంలోని స్క్రాప్ దుకాణంలో నిద్రిస్తున్న రాజశేఖర్, అతని తమ్ముడు ఎల్లప్పను దుండగులు కత్తితో బెదిరించారు. అనంతరం రూ.25 వేల నగదు, రెండు సెల్‌ఫోన్లను దోచుకెళ్లారు. ఈ ఘటనలో రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

సీసీటీవీ ఆధారాలతో నిందితుడి గుర్తింపు

ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీ, సాంకేతిక ఆధారాల సహాయంతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లోని టోలిచౌకికి చెందిన మహ్మద్ రబ్బానీని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.3,500 నగదు, ఒక సెల్‌ఫోన్, కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

మరో ఇద్దరి కోసం గాలింపు

ఈ కేసులో మహ్మద్ సోహెల్, మహ్మద్ అస్లాం పరారీలో ఉన్నారని, వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టినట్లు డీసీపీ తెలిపారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ జి. రుద్రవీర్, డీఐ సమరం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. నేరాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

గుడివాడలో అభివృద్ధి పనులు వేగవంతం...26, 29, 30వ వార్డుల్లో రూ.5.80 కోట్లతో 16 సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే రాము శంకుస్థాపన.

సాయినగర్ లో రూ.95 లక్షలతో, బేతవోలు శ్మశానం పక్కన రూ.85 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం.

30వ వార్డు ధనియాలపేట, న్యూ కాలనీల్లో రూ.4 కోట్లతో 14 సీసీ రోడ్ల అభివృద్ధికి శ్రీకారం...

స్థానిక మహిళలు, ప్రజల చేతుల మీదుగా శంకుస్థాపన...ప్రజల భాగస్వామ్యానికి పెద్దపీట.

40 ఏళ్ల తర్వాత తొలిసారి రోడ్డు నిర్మాణం... సాయినగర్ వాసుల హర్షం...ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ ఒక్కో సమస్య పరిష్కరిస్తున్నా:ఎమ్మెల్యే రాము.

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు ప్రజలంతా మద్దతుగా నిలవాలి:ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి.









గుడివాడ అక్టోబర్ 10 (విజన్ పక్షం): గుడివాడ పట్టణంలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని ప్రధాన ప్రాంతాలతో పాటు దశాబ్దాలుగా కనీస మౌలిక వసతులకు నోచుకోని శివారు కాలనీల అభివృద్ధిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక దృష్టి సారించారు. ప్రజలకు అవసరమైన రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగా పట్టణంలోని 26, 29, 30వ వార్డుల్లో మొత్తం రూ.5.80 కోట్ల అంచనా వ్యయంతో 16 సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే రాము శంకుస్థాపన చేశారు. 26వ వార్డు డీ మార్ట్ వెనుక ఉన్న సాయినగర్‌లో రూ.95 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి, 29వ వార్డులోని శ్మశానం పక్కన రూ.85 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శ్రీకారం చుట్టారు. అలాగే 30వ వార్డు ధనియాలపేట మరియు న్యూ కాలనీల్లో రూ.4 కోట్లతో 14 సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ముఖ్యంగా ఇప్పటివరకు సరైన రహదారి సదుపాయాలు లేని శివారు ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక మహిళలు, ప్రజలతోనే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయిస్తూ ప్రజల భాగస్వామ్యానికి ప్రాధాన్యతనిస్తున్నారు. అభివృద్ధి పనుల శంకుస్థాపన సందర్భంగా ఎమ్మెల్యే రాము స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాయినగర్‌లో విద్యుత్ స్తంభాలకు సంబంధించిన సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, వెంటనే విద్యుత్ శాఖ డీఈతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టడంతో పాటు బుధవారం నాటికి తనకు నివేదిక అందించాలని స్పష్టం చేశారు.

సుమారు 40 ఏళ్ల తర్వాత తమ కాలనీలో మొదటి సారి రహదారి నిర్మాణం చేపడుతుండటంపై సాయినగర్ వాసులు హర్షం వ్యక్తం చేశారు. తమ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చిన ఎమ్మెల్యే రాముకు కృతజ్ఞతలు తెలిపారు.

ధనియాలపేట కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే తాగునీరు, డ్రైనేజీ సమస్యలను గుర్తించారు. ఆయా సమస్యలకు కారణాలేంటని మున్సిపల్ అధికారులను ప్రశ్నించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. స్థానికంగా సమస్యలు పరిష్కారం కాకపోతే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని భరోసా ఇచ్చారు. ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ..తాను గుడివాడకు వచ్చిన సమయంలో దశాబ్దాలుగా వేలాది మంది నివసిస్తున్న కాలనీల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని ఎమ్మెల్యే రాము అన్నారు. అప్పుడే ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలను పరిష్కరించి, వారికి మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని తెలిపారు.


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మౌలిక సదుపాయాలు లేని అనేక ప్రాంతాల్లో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతూ మార్పునకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ముఖ్యంగా ధనియాలపేట కాలనీలోనే సుమారు రూ.15 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. రహదారులు, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు ప్రజల కనీస అవసరాలని, వాటిని కల్పించడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు.


ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవడం తన బాధ్యతగా భావిస్తున్నానని రాము తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ, ఒక్కో సమస్యను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నానని అన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలతో పాటు పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పించే మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లకు ప్రజలంతా మద్దతుగా నిలవాలని ఎమ్మెల్యే రాము విజ్ఞప్తి చేశారు. గుడివాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

అభివృద్ధి కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్,జనసేన ఇన్చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ,పట్టణ టిడిపి అధ్యక్షులు పండ్రాజు సాంబశివరావు, టిడిపి నాయకులు గోర్జీ సత్యనారాయణ, లింగం ప్రసాద్, బొంబాయి శ్రీను, చేకూరి జగన్మోహనరావు, కార్పొరేషన్ డైరెక్టర్లు దింట్యాల రాంబాబు, మజ్జాడ నాగరాజు,మున్సిపల్ వీ.ఇు సతీష్ చంద్ర,ణ.ఇు శివాజీ ,ఏ.ఈలు శ్రావణ్ కుమార్, సత్యనారాయణ...నాయకులు పోలాసీ ఉమా, రామీదేని వేణుబాబు, మహమ్మద్ రఫీ, పులవర్తి డేవిడ్, కంచర్ల సుధాకర్, వేశపోగు ఇమ్మానుయేలు, విశ్వనాథ్, సొంటి రామకృష్ణ, జువ్వనపుడి నిరంజన్ రావు, గొర్ల శ్రీలక్ష్మి, కోడూరు ప్రభు, ఏసేపు....జనసేన నాయకులు:- కొదమల గంగాధర్, నాగూర్ భాష, నాగూర్ భాష, రాకేష్ చంద్ర, బుడమ వీర్రాజు, కంచనపల్లి సీతారాం, శేషము మురళి, బి. సాయి పవన్, ఎ. వెంకటేష్, శ్రవణం రామారావు, బూరగడ్డ అనిల్, శీతాల సుభాషిని,26వ వార్డు నాయకులు:- పైడుముక్కల వంశీ, మీరావాలి, కాసింహా, మీర్ భాష, కాకర్ల సురేష్, రమేష్, కనకరాజు,29వ వార్డు నాయకులు:- సలుమూరి తిరుపతరావు, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, చీకటి సూర్యనారాయణ, మొక్కపాటి కుమార్, తెర్లి కనకారావు, రాజకుమార్, వీర కృష్ణ, లక్ష్మి, లక్ష్మి కుమారి,30వ వార్డు నాయకులు:- వంగపండు ఆదినారాయణ, దేవాది నాగేశ్వరరావు, ఎ. నరేంద్రనాథ్, ఎ. చంద్రశేఖర్, నాగరాజు, సుబ్రహ్మణ్యం, రఘు, ఎస్ లక్ష్మి, లలిత కుమారి, శ్రీనివాసరావు, తీరు, రామారావు, టి శ్రీను, స్థానిక ప్రజలు, కూటమి నాయకులు, మున్సిపల్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





సురక్షితమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలి



శ్రీకాకుళం, అక్టోబర్ 10 (విజన్ పక్షం): ప్రతి ఒక్కరూ ఆహార భద్రతా ప్రమాణాలపై ప్రాథమిక అవగాహన పెంచుకుని, 'ఈట్ రైట్ ఇండియా' స్ఫూర్తితో సురక్షితమైన ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా ఆహార భద్రతాధికారి కె. లక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర ఆహార భద్రతా విభాగం డైరెక్టర్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ లక్ష్మీ నారాయణ ఆదేశాల మేరకు జిల్లా ఆహార భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఆహార భద్రత, పరిశుభ్రత, పోషకాహార అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజారోగ్య పరిరక్షణ, కల్తీ లేని నాణ్యమైన ఆహార వినియోగం లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో ఉదయం నడకకు వచ్చే వాకర్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజలు విశేషంగా పాల్గొన్నారు. ఆహారాన్ని తయారుచేసేటప్పుడు, తీసుకునేటప్పుడు చేతుల శుభ్రత పాటించాలని, పచ్చి కూరగాయలు, వండిన పదార్థాలను వేర్వేరుగా నిల్వ చేయాలని, తగినంత ఉష్ణోగ్రత వద్ద ఉడికించి స్వచ్ఛమైన తాగునీటిని మాత్రమే వినియోగించాలని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు. అధిక ఉప్పు, చక్కెర, నూనె పదార్థాల వాడకాన్ని తగ్గించడం ద్వారా రక్తపోటు, మధుమేహం వంటి దీర్ఘకాలిక సమస్యల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని, ఆహారంలో తృణధాన్యాలు, తాజా ఆకుకూరలు, కాలానుగుణ పండ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఒకసారి వాడిన నూనెను పదే పదే వేడి చేసి వాడటం వల్ల గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ కారక రసాయనాలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు. వేడి ఆహార పదార్థాలు, టీలను నాసిరకం ప్లాస్టిక్ కవర్లలో తీసుకురావడం, న్యూస్‌పేపర్లలో కట్టి ఇవ్వడం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వార్తాపత్రికల ప్రింటింగ్ సిరాలోని రసాయనాలు ఆహారంలో కలిసి విషపూరితమవుతాయని వివరించారు. ప్యాక్ చేసిన ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ నంబర్, తయారీ తేదీ, గడువు ముగిసే తేదీ, పోషకాల వివరాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఆహార కల్తీ గుర్తింపు పరీక్షలు, పోషకాహార నియమాలతో కూడిన సమగ్ర సమాచార ప్రచార పత్రాలను వాకర్స్ క్లబ్ సభ్యులకు, హాజరైన ప్రజలకు పంపిణీ చేశారు.

దసరా సెలవులను ఆనందంగా గడపండి.. ప్రమాదాలకు దూరంగా ఉండండి....!

వెలుగొండ సందర్శనకు వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దు..!

మార్కాపురం గ్రామీణ ఎస్సై వేమన సూచన...



మార్కాపురం అక్టోబర్ 10 (విజన్ పక్షం): దసరా సెలవులను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆనందంగా గడపాలని మార్కాపురం గ్రామీణ ఎస్సై వేమన సూచించారు. సెలవుల సమయంలో పిల్లలు సరదాగా గడిపే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. దసరా సెలవుల్లో విద్యార్థులు వెలుగొండ ప్రాంతాన్ని సందర్శించే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై హితవు పలికారు. ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లడం, భద్రతా నియమాలను నిర్లక్ష్యం చేయడం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందన్నారు. పర్యాటక ప్రాంతాలను సందర్శించేటప్పుడు పెద్దల పర్యవేక్షణలోనే వెళ్లాలని సూచించారు. పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారు? ఎవరితో వెళ్తున్నారు? అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం దృష్టి సారించాలని తెలిపారు. సెలవుల సమయంలో విద్యార్థుల భద్రతే ముఖ్యమని, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రమాదాలకు దారితీయవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పోలీసుల సూచనలు పాటిస్తూ దసరా సెలవులను సురక్షితంగా, సంతోషంగా గడపాలని గ్రామీణ ఎస్సై వేమన కోరారు.

యువత భవిష్యత్తుకు నైపుణ్యాలే పెట్టుబడి

కొండపల్లి ఏపీహెచ్ఎంఈఎల్ ఏరియాలో రూ.50 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌కు శ్రీకారం.

నిర్మాణ పనుల్లో నాణ్యత, వేగం కీలకం.

-మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు.



ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి, అక్టోబర్ 10 (విజన్ పక్షం): యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి, వారిని ఉపాధి అవకాశాలకు చేరువ చేయడంలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పేర్కొన్నారు. యువత స్వయం సమృద్ధి సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కొండపల్లి పట్టణంలోని ఏపీహెచ్ఎంఈఎల్ (ఆ్రానవీజూ) ఏరియాలో డి.ఎం.ఎఫ్ నిధులు రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవనానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు.

నైపుణ్యమే ఉపాధికి మార్గం: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవడం ఎంతో అవసరమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు పేర్కొన్నారు. కేవలం విద్యార్హతలకే పరిమితం కాకుండా, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా యువత ఉద్యోగ, ఉపాధి రంగాల్లో మెరుగైన అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు. కొండపల్లిలో ఏర్పాటు కానున్న ఈ కేంద్రం స్థానిక యువతకు నైపుణ్యాభివృద్ధి దిశగా ఉపయోగకరంగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

యువతకు అవకాశాలు.. ప్రాంతానికి అభివృద్ధి: యువతకు మెరుగైన భవిష్యత్తును అందించడంతోపాటు, స్థానికంగా అభివృద్ధికి దోహదపడే మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గారు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ గారి సహకారం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు, మంత్రి నారా లోకేష్ గారి సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను అభివృద్ధి చేస్తూ, యువతకు ఎదిగేందుకు తగిన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు.

నాణ్యతలో రాజీ వద్దు: స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ భవన నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు, నిర్మాణ బాధ్యులకు సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, ప్రజాధనంతో చేపట్టే పనులు దీర్ఘకాలం మన్నికగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పనుల పురోగతిలో నిర్లక్ష్యం లేకుండా నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సంస్కృతి ప్రతీక బతుకమ్మ పండుగ

బాపూజీ హైస్కూల్ వ్యవస్థాపకులు' కరస్పాండెంట్ నవ్వ ప్రభాకర్ రావు



కుత్బుల్లాపూర్,అక్టోబర్10(విజన్ పక్షం): తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ పండగ ప్రతీక అని బాపూజీ హైస్కూల్ వ్యవస్థాపకులు, కరస్పాండెంట్ నవ్వ ప్రభాకర్ రావు అన్నారు.శనివారం నాడు జగద్గిరిగుట్ట డివిజన్ వెంకటేశ్వర్ నగర్ లోని బాపూజీ హైస్కూల్ లో బతుకమ్మ వేడుకలను పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.విద్యార్థినిలు సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా రంగురంగుల తంగేడు, గునుగు,బంతి,చామంతి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి తీసుకువచ్చారు విద్యార్థినిలు.అనంతరం విద్యార్థినిలు బతుకమ్మల చుట్టూ చేరి బతుకమ్మ ఆటపాటలతో కోలాటాలతో ఆడిపాడారు. ఉపాధ్యాయులు పిల్లలతో కలిసి బతుకమ్మ పాటలు పాడి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వ్యవస్థాపకులు నవ్వ ప్రభాకర్ రావు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా బతుకమ్మను అందంగా పేర్చిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో విద్యార్థినిలు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సత్య 'జెట్లీ'.. దుబాయ్ లో ఫన్నీ రీజన్ తో బ్యాన్?



స్టార్ కమెడియన్ సత్య లీడ్ రోల్ లో తెరకెక్కిన కామెడీ అండ్ యాక్షన్ థ్రిల్లర్ జెట్లీ మూవీ ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. సత్యతో పాటు వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటించిన ఆ సినిమాలో గుండు సుదర్శన్, అజయ్, గెటప్ శ్రీను, వైవా హర్ష, కబీర్ బేడీ, శ్రీనివాసరెడ్డి, రియా సింఘా తదితరులు కనిపించారు. క్లాప్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై మైత్రీ మూవీ సీఈవో చిరంజీవి, హేమలత నిర్మించారు. మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సమర్పించిన ఆ సినిమాకు రితేష్ రానా దర్శకత్వం వహించారు. మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఆ సినిమా, కామెడీతో పాటు యాక్షన్ ఎలిమెంట్స్ తో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. అయితే ఆ చిత్రానికి యూఏఈ దేశాల్లో అనుమతి లభించలేదు. దుబాయ్ తో పాటు గల్ఫ్ లోని కొన్ని దేశాల్లో జెట్లీ రిలీజ్ కాలేదు. దీనికి గల కారణంపై ఇటీవల జరిగిన ప్రెస్ మీట్ లో నిర్మాత చిరంజీవి (చెర్రీ) స్పందించారు. ఆయన చెప్పిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ప్రెస్ మీట్ లో చెర్రీ మాట్లాడుతూ.. "సినిమాలో గుండు సుదర్శన్ చేసిన నూర్జహాన్ క్యారెక్టర్ ను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. కానీ అదే క్యారెక్టర్ కారణంగా యూఏఈలో మాకు సమస్య ఎదురైంది. అక్కడి సెన్సార్ అధికారులు కొన్ని సన్నివేశాలను అరబ్ ప్రజలను హేళన చేసినట్లు భావించారు. ముఖ్యంగా ఆ పాత్ర తరచూ బాత్రూమ్ కు వెళ్లే సన్నివేశాలు వారికి అభ్యంతరకరంగా అనిపించాయి" అని వివరించారు. ఆ వ్యాఖ్యలతో అక్కడ ఉన్న మీడియా ప్రతినిధుల్లో ఒకరు సరదాగా స్పందిస్తూ.. "సమస్య ఉంటే యూఏఈ వాళ్లు బాత్రూమ్ కు వెళ్లరా?" అంటూ చమత్కరించారు. దీంతో అక్కడ ఉన్న మూవీ టీమ్ తోపాటు అంతా నవ్వేశారు. అదే విషయంలో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా.. ఫన్నీ రీజన్ తో ఏకంగా సినిమా రిలీజ్ ను బ్యాన్ చేశారంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అయితే సినిమాలో గుండు సుదర్శన్ నూర్జహాన్ పాత్ర అరబ్ సంస్కృతిని తప్పుగా చూపిస్తున్నట్లు యూఏఈ సెన్సార్ బోర్డు భావించినట్లు తెలుస్తోంది.

ఆమె నా షర్ట్ పట్టుకొని.. చెడామడా తిట్టేసింది..

దెబ్బకు నేను షాక్ అయ్యా



కామెడీ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ గా పేరు తెచ్చుకున్నాడు అల్లరి నరేష్.. తన కామెడీతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాడు నరేష్. కామెడీ సినిమాలు మాత్రమే కాదు సీరియస్ సినిమాలు కూడా చేసి అలరించాడు నరేష్. మహేష్ బాబు నటించిన మహర్షి సినిమాలో సెకండ్ హీరోగానూ నటించాడు. వైవిధ్యమైన సినిమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారారు. కామెడీ హీరోగా కెరీర్ మొదలు పెట్టిన నరేష్, సీరియస్ సినిమాలతోను ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నారు. ఇటీవలే నరేష్ నటించిన సినిమాలు మంచి విజయాన్ని అందుకుంటున్నాయి. ఎన్నో వైవిధ్యమైన సినిమాలు చేసిన నరేశ్ కెరీర్ లో వన్ ఆఫ్ ది బిగెస్ట్ హిట్ సినిమా కితకితలు. అల్లరి నరేష్, గీతాసింగ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన హాస్యభరిత చిత్రం కితకితలు తెలుగు ప్రేక్షకులను అలరించింది. ఈ చిత్రం విడుదలైన తర్వాత సాధించిన విజయం, దాని వెనుక ఉన్న ఆసక్తికరమైన విషయాలను నరేష్ గతంలో ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఈ చిత్రంలో గీతాసింగ్ వంటి నటిని హీరోయిన్‌గా తీసుకోవడం పట్ల మొదట తన తండ్రి, చిత్ర నిర్మాతతో సహా అనేకమందికి సందేహాలు కలిగాయని నరేష్ వెల్లడించారు. ఆ సమయంలో తాను కొన్ని హిట్స్‌లో ఉన్నందున, ఈ సబ్జెక్ట్, హీరోయిన్ ఎంపికపై ప్రశ్నలు తలెత్తాయట. అయితే, "కథ డిమాండ్ చేస్తే ఎలాంటి పాత్రకైనా వెళ్ళాలి" అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్ళినట్లు తెలిపారు. ఈ సినిమా కథాంశం ఒక ఐశ్వర్యా రాయ్ లాంటి భార్యను కోరుకునే వ్యక్తికి కల్పనారాయ్ లాంటి భార్య వస్తే ఎలా ఉంటుంది అనేదేనని నరేష్ వివరించారు. చిత్ర యూనిట్ లో కొంతమందిలో భయం ఉన్నప్పటికీ, నరేష్ తండ్రి కథపై పూర్తి నమ్మకం ఉంచారు. అయినప్పటికీ, బడ్జెట్ విషయంలో చాలా కట్టుదిట్టంగా వ్యవహరించారు. మొదట మూడు కోట్ల బడ్జెట్ అనుకున్నప్పటికీ, బయటి వారి సందేహాలు, "ఈ సినిమా ఆడుతుందా? లావు హీరోయిన్‌ను పెడితే ఎవరు చూస్తారు?" వంటి ప్రశ్నలతో బడ్జెట్‌ను 80-90 లక్షలకు తగ్గించారట. సినిమా షూటింగ్‌ను కూడా సోమవారం నుంచి శుక్రవారం వరకు మాత్రమే నిర్వహించి, వారాంతాల్లో సెలవులు ఇచ్చారట. ఈ కట్టుదిట్టమైన బడ్జెట్‌తో తెరకెక్కిన కితకితలు సినిమా అంచనాలకు మించి ఎనిమిది కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి అద్భుత విజయం సాధించింది. ఇది అందరినీ ఆశ్చర్యపరిచింది. గీతాసింగ్‌కు ఈ చిత్రం జీవితకాల గుర్తింపును తెచ్చిపెట్టిందని నరేష్ అన్నారు. ఈ రోజుకీ ఆమె ఎక్కడ కనిపించినా ప్రజలు ఆమెను కితకితలు హీరోయిన్‌గానే గుర్తిస్తారని, ఆమె అంతకు ముందు అనేక సినిమాలు చేసినప్పటికీ, ఈ చిత్రమే ఆమెకు నిజమైన "క్లెయిమ్ టు ఫేమ్" అని నరేష్ తెలిపారు. గీతాసింగ్ నటనకు, అంకితభావానికి నరేష్ ప్రశంసలు కురిపించారు. ఆమె సినిమా కోసం డబ్బింగ్ స్వయంగా చెప్పుకోవడంతో పాటు ఎంతో కష్టపడ్డారని, సినిమాలో నరేష్‌కంటే ఎక్కువ డైలాగులు ఆమెకే ఉన్నాయని గుర్తు చేశారు. ఒక సందర్భంలో ఏలూరు వెళ్ళినప్పుడు, ఒక మహిళ నరేష్‌ను షర్ట్ పట్టుకుని "లావుగా ఉంటే తప్పేంటయ్యా? మా ఆయన కూడా నువ్వు కితకితలు హీరోయిన్ లా ఉన్నావు అంటున్నాడు" అని ప్రశ్నించిందని నరేష్ తెలిపారు. అలాగే, ఒక షూటింగ్ సమయంలో ప్రగతి రిసార్ట్‌లో గీతాసింగ్ స్విమ్‌సూట్‌లో ఉన్నప్పుడు, కొందరు చూసి నవ్విన సంఘటనను నరేష్ గుర్తు చేసుకున్నారు. లావుగా ఉన్నవారు స్విమ్‌సూట్ ధరించకూడదని ఎక్కడా నియమం లేదని, అయినా ప్రజలు వారి శరీర ఆకృతిని బట్టి వ్యంగ్యంగా చూస్తారని నరేష్ అభిప్రాయపడ్డారు. ఈ సంఘటనలు గీతాసింగ్‌కు మానసిక వేదనను కలిగించినప్పటికీ, తన తండ్రి ఇచ్చిన ప్రోత్సాహంతో ఆమె వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నారని నరేష్ తెలిపారు. "మనసు ముఖ్యం, ఆకారం కాదు" అనే సందేశాన్ని తన తండ్రి అప్పట్లో చెప్పేవారని నరేష్ గుర్తు చేసుకున్నారు. నేటికీ గీతాసింగ్ తనను, తన తండ్రిని గౌరవంగా చూస్తారని, తమను కలిసి విషయాలు పంచుకుంటారని నరేష్ పేర్కొన్నారు. ఈ అనుభవాలన్నీ కితకితలు సినిమా కేవలం ఒక హాస్య చిత్రం కాదని, సామాజిక సందేశాన్ని, స్వీయ గౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం కూడా చేసిందని నరేష్ తెలిపారు.

చరణ్ కోసం సీక్రెట్ డైరెక్టర్ ఎవరు?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన ప్లానింగ్‌తో టాలీవుడ్‌ను ఆశ్చర్యపరుస్తున్నారు. జూన్ 4న 'పెద్ది' సినిమా విడుదల కాబోతుండటంతో అందరిలోనూ ఆసక్తి మొదలైంది. అయితే దీని తర్వాత సుకుమార్ సినిమా కంటే ముందే చరణ్ ఒక క్విక్ ప్రాజెక్ట్ చేయబోతున్నారనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మించబోతున్నారు. ఇప్పటికే చరణ్ దీని కోసం డేట్స్ కూడా కేటాయించారని తెలియడంతో, అసలు ఆ సీక్రెట్ డైరెక్టర్ ఎవరు అన్నది ఇప్పుడు పెద్ద సస్పెన్స్‌గా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో ఈ మధ్య కాలంలో చాలా మంది కొత్త దర్శకులతో పాటు సీనియర్ దర్శకులు కూడా పనిచేశారు. నాగవంశీ వద్ద ప్రస్తుతం హిట్ ట్రాక్‌లో ఉన్న దర్శకుల లిస్ట్ గట్టిగానే ఉంది. అయితే చరణ్ లాంటి భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోకి ఎవరిని సెట్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. నాగవంశీ ఇప్పటికీ రకరకాల కథలు వింటున్నారా లేక ఇప్పటికే ఒకరిని ఫిక్స్ చేసి రహస్యంగా ఉంచుతున్నారా అన్నది అంతుచిక్కడం లేదు. అయితే గౌతమ్ స్టైల్ ఆఫ్ మేకింగ్ మీద నాగవంశీకి గట్టి నమ్మకం ఉంది. అందుకే ఇప్పుడు మళ్ళీ గౌతమ్ తోనే తన శైలికి భిన్నంగా చరణ్ కోసం ఏదైనా కొత్త స్క్రిప్ట్ సిద్ధం చేయిస్తున్నారా అనే చర్చ ఫిలిం నగర్ లో గట్టిగా వినిపిస్తోంది. గతంలోనే చరణ్, గౌతమ్ కాంబినేషన్ లో ఒక సినిమా రావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల అది సెట్ కాలేదు. ఇక ఏడాది క్రితం నాగవంశీ నిర్మాణంలో వచ్చిన 'కింగ్ డమ్' సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఆ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. ఒకవేళ చరణ్ మళ్ళీ గౌతమ్ వైపే మొగ్గు చూపితే అది ఖచ్చితంగా ఒక డిఫరెంట్ క్రేజీ ప్రాజెక్ట్ అవుతుంది. అయితే నాగవంశీ ప్లానింగ్ ప్రకారం ఇది చాలా వేగంగా పూర్తి చేసే సినిమా కావాలి. ఎందుకంటే జూన్ నుంచి సుకుమార్ సినిమా (=జ17) పనులు కూడా మొదలుకాబోతున్నాయి. ఈ గ్యాప్ లోనే చరణ్ చిన్న సినిమాను కంప్లీట్ చేయాలని చూస్తున్నారు. దర్శకుడు ఎవరైనా సరే, సితార సంస్థ నుంచి వచ్చే ఈ అఫీషియల్ అప్ డేట్ కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 2026 సంవత్సరం రామ్ చరణ్ కెరీర్ లో చాలా బిజీగా ఉండబోతోంది. 'పెద్ది' రిజల్ట్ తర్వాత చరణ్ చేయబోయే ఈ క్విక్ ప్రాజెక్ట్ ఆయన ఇమేజ్ కు ఎలా ప్లస్ అవుతుందో చూడాలి. నాగవంశీ తన సీక్రెట్ డైరెక్టర్ పేరును ఎప్పుడు బయటపెడతారో కానీ, ఈ లోపే రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఆ దర్శకుడు ఎవరనేది మరికొన్ని రోజుల్లో తేలిపోయే అవకాశం ఉంది.

ఈ బ్యూటీకి బ్రేకప్ అయ్యిందా.? బాధ నుంచి కోలుకోవడానికి ఏం చేసిందో చెప్పేసిన భామ


ప్రేమలో విఫలమైనప్పుడు ఆ బాధ నుండి బయటపడటం ప్రతి ఒక్కరికీ ఒక పెద్ద సవాలుతో కూడుకున్న విషయమే. దీనికి ఎలాంటి నిర్దిష్టమైన సూత్రాలు లేవు. అయితే తాజాగా బాలీవుడ్ చిత్ర పరిశ్రమకు చెందిన ఒక యువ కథానాయిక తాను ఎదుర్కొన్న బ్రేకప్ బాధల గురించి, ఆ హార్ట్ బ్రేక్ నుండి ఎలా కోలుకుందో ఒక ఇంటర్వ్యూలో మనసు విప్పి మాట్లాడింది. యువతలో మంచి క్రేజ్ ఉన్న ఒక స్టార్ కిడ్ తన గత ప్రేమ బంధాల గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. గతంలో తాను ఎదుటివారి కోసం తనను తాను ఎలా తగ్గించుకుందో చెబుతూ ఎమోషనల్ అయ్యింది. ఒంటరిగా జీవించడం ప్రారంభించిన తర్వాతే తనకు ప్రేమపై ఒక పరిణతి వచ్చినట్లు పేర్కొంది. హార్ట్ బ్రేక్ నుండి సదరు బాలీవుడ్ నటి ఇటీవల జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ తన హార్ట్ బ్రేక్ అనుభవాలను పంచుకుంది. "ప్రేమలో విఫలమైనప్పుడు నేను బాగా ఏడుస్తాను, ఐస్ క్రీమ్ తింటాను. అరిజిత్ సింగ్ పాడిన విషాదకరమైన పాటలు వింటాను. ఆ తర్వాత కొద్దిసేపటికి ఆ బాధను మర్చిపోతాను" అంటూ చాలా సరదాగా సమాధానం ఇచ్చింది. సాధారణ యువతుల తరహాలోనే తాను కూడా బ్రేకప్ బాధను అనుభవిస్తానని తెలిపింది. అయితే గత బంధాల ద్వారా తాను ఎన్నో విషయాలను నేర్చుకున్నానని, ఆ పాఠాలు ముందే అర్థమై ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది. ముఖ్యంగా ఒంటరిగా జీవించడం ప్రారంభించిన తర్వాత తన వ్యక్తిగత స్పేస్‌ను ప్రేమించడం అలవాటు చేసుకున్నానని పేర్కొంది. నన్ను నేను తగ్గించుకున్నా గత బంధాలలో తాను చేసిన తప్పుల గురించి చెబుతూ ఒక ప్రముఖ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో ఆమె భావోద్వేగానికి లోనైంది. "నా గత బంధాలలో నా కంటే ఎదుటివారే ఎక్కువగా వెలగాలని కోరుకునేదాన్ని. అందుకోసం నన్ను నేను తగ్గించుకునేదాన్ని. ఎదుటివారికి నచ్చేలా నన్ను నేను పూర్తిగా మార్చుకున్నాను. కానీ నన్ను ఎవరూ మార్చలేరనే సత్యాన్ని నేను ముందే గ్రహించి ఉంటే బాగుండేది. బంధాల కోసం మనం ఎప్పుడూ మన వ్యక్తిత్వాన్ని కోల్పోకూడదు" అని చాలా పరిణతితో కూడిన వ్యాఖ్యలు చేసింది. తనకంటూ ఒక సొంత స్థలాన్ని ఏర్పరచుకున్న తర్వాతే ప్రేమ మరియు బంధాలపై తనకు సరైన అవగాహన వచ్చిందని వెల్లడించింది. డేటింగ్ రూమర్స్ ఈ యువ నటి గతంలో బాలీవుడ్ హీరో ఆదిత్య రాయ్ కపూర్‌తో ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. వీరిద్దరూ దాదాపు రెండేళ్ల పాటు డేటింగ్ చేసిన తర్వాత పరస్పర అంగీకారంతోనే విడిపోయినట్లు సమాచారం. ఆ తర్వాత ఇటీవల కాలంలో వాకర్ బ్లాంకో అనే మాజీ మోడల్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ డేటింగ్ వార్తలపై అటు నటి కానీ, ఇటు మోడల్ కానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. ఏదేమైనా తన వ్యక్తిగత విషయాలను చాలా నిజాయితీగా పంచుకుంటూ ఈ బ్యూటీ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.





మిస్టర్ వర్మ్ ఫ్రమ్ హోమ్

త్రిగుణ్, పాయల్ రాధాకృష్ణ , అనీష్ కురువిల్లా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ వర్మ్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని దర్శకుడు. అరవింద్ మాంద్యం నిర్మాత. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 15న విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. శ్రీవెంకటసాయి ఫిల్మ్స్ పతాకంపై ముత్యాల రామదాస్ ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. భవిష్యత్తులో వర్మ్ ఫ్రమ్ హోమ్ ఎలా ఉండబోతోందో తెలిపే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా రూపొందుతున్నదని, ఇందులో ప్రేమకథ కూడా ఉంటుందని, నిజాయితీ గల అబ్బాయి, అమ్మాయి ప్రేమించుకుంటే, ఆ ప్రయాణం ఎంత వినోదాత్మకంగా ఉంటుందో ఈ సినిమాలో చూస్తారని, సమ్మర్‌లో సంపూర్ణంగా వినోదాన్ని పంచే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రవికుమార్.వి, సంగీతం: ప్రకాశ్ చెరుకూరి, అరుణ్ చిలువేరు, సమర్పణ: సీహెచ్‌వీఎస్ఎన్ బాబ్జీ, నిర్మాణం: లోటస్ క్రియేషన్స్.



Flat No: G-2, Mount Nasir Apartment, 6-1-57 to 61, Saifabad, Hyderabad9441221980